# బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 సం॥లకు తగ్గించబడుతోందా?

**- ఎం. తారానాథ్, సహాయ ప్రధాన కార్యదర్శి**
**బిఎస్ఎన్ఎల్ఇయు, ఆంధ్రప్రదేశ్ సర్కిల్**

ఏదైనా ప్రభుత్వరంగ సంస్థకు నష్టాలు వస్తే, ఆ సంస్థను తిరిగి లాభాలలో నడపడానికి తగు సూచనలు చేసే ఉద్దేశ్యంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో పనిచేసే బోర్డ్ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌ను కేంద్ర ప్రభుత్వం 6.12.2004న ఏర్పాటుచేసింది.

బోర్డ్ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (బిఆర్ పిఎస్ఇ)లో ఛైర్మన్, ముగ్గురు అనధికార సభ్యులు, ముగ్గురు అధికార సభ్యులు, ప్రభుత్వరంగ సంస్థల సెలక్షన్ బోర్డు ఛైర్మన్, ఎస్‌సిఓపిసి ఛైర్మన్, మరియు ఓఎన్‌జిసి ఛైర్మన్ సభ్యులుగా వుంటారు. ప్రస్తుతం బిఆర్ పిఎస్ఇ ఛైర్మన్‌గా డా॥ నితీష్ సేన్ గుప్తా (మాజీ పార్లమెంటు సభ్యులు) వున్నారు.

**బిఆర్ పిఎస్ఇ పని విధానం**

1. నష్టాలలో నడిచే ప్రభుత్వరంగ సంస్థ యొక్క అభ్యర్థన పైగానీ, లేదా తనకు తాను స్వంతంగా గానీ ఆయా పిఎస్‌యుల స్థితి గతులను పరిశీలించి తగు సలహాలు సూచనలు ఇస్తుంది.
2. పిఎస్‌యుని ఎలా తిరిగి లాభాలలోనికి తేవడానికి ప్రయత్నిస్తున్నారో ఆయా పిఎస్‌యుల యాజమాన్యాలే బిఆర్‌పిఎస్ఇకి తెలియ జేయాల్సి ఉంటుంది.
3. బిఆర్‌పిఎస్ఇ ఈ సూచనలను పరిశీలించి అవసరమైన పక్షంలో ఆయా రంగాలలోని సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకొని సూచనలు చేస్తారు.
4. ఈ సలహాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ పరిశీలించి ఆయా ప్రభుత్వరంగ సంస్థల బోర్డులకు ఈ సలహాలపై తగు చర్యలు తీసుకొనే నిమిత్తం పంపిస్తుంది.
5. ఆయా ప్రభుత్వరంగ సంస్థల బోర్డులు ఈ ప్రతిపాదనల్ని తిరస్కరించవచ్చు/అంగీకరించవచ్చు/మార్పులు సూచించవచ్చు లేదా సంబంధిత మంత్రిత్వశాఖల పరిశీలన కోసం పంపించవచ్చు.
6. బిఆర్‌పిఎస్ఇ ఆర్థిక మంత్రిత్వశాఖను, కార్మిక, బ్యాంకింగ్ రంగాలను సంప్రదించి ఆయా ప్రభుత్వరంగ సంస్థని లాభాలలోకి తేవడానికి వడ్డీ మాఫీ, ఋణాల మంజూరు, పన్నురాయితీ లాంటి అనేక ఆర్థిక వెసులుబాటును అందుకు అవసరమైన మొత్తం ఎంతో సూచిస్తుంది.
7. బిఆర్‌పిఎస్ఇ చేసే సిఫార్సులన్నీ సలహాలు మాత్రమే.
8. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఈ సిఫార్సులను ఆయా మంత్రిత్వశాఖలకు తగు విధమైన అమలుకోసం పంపిస్తాయి.

**నష్టాలు వచ్చిన ప్రభుత్వరంగ సంస్థ బిఆర్‌పిఎస్ఇకి ఏఏ వివరాలు అందించాల్సి ఉంది**

నష్టాలు వచ్చిన ప్రభుత్వరంగ సంస్థ బిఆర్‌పిఎస్ఇకి ఈ క్రింది వివరాలు అందించాల్సి ఉంటుంది.

1. సంస్థ ఎప్పుడు ప్రారంభించారు.
2. సంస్థలోని ఉన్నతస్థాయిలో అధికారులు ఎవరు.
3. బోర్డులోని అధికారుల వివరాలు.
4. సంస్థ యొక్క విలువ ఆస్తిపాస్తులు.
5. సంస్థ మార్కెటింగ్ వ్యూహాలు.
6. సంస్థకు లభించిన ఆర్థిక సహాయాలు.
7. గత 5 సంవత్సరాలుగా సంస్థకు వచ్చిన ఆర్థిక లాభనష్టాలు.

8. నష్టాల నివారణకు తీసుకుంటున్న చర్యలు.
9. గత 5 సంవత్సరాల లాభనష్టాలు, రాబోయే రెండు సంవత్సరాలకు పియస్‌యు ఆర్థికస్థితి పై అంచనాలు.

ఇలా అనేక అంశాలు బిఆర్‌పిఎస్‌ఇకి అందించాల్సి ఉంటుంది.

2008-09 ఆర్థిక సంవత్సరంలోని ఆర్థిక ఫలితాల ఆధారంగా 73 ప్రభుత్వరంగ సంస్థలు బిఆర్‌పిఎస్‌ఇకి పంపబడ్డాయి. సమీక్ష తర్వాత 66 సంస్థల పై తన నివేదికలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌కు బిఆర్‌పిఎస్ఇ పంపింది. వీటిలో 37 పిఎస్‌యుల పై బిఆర్‌పిఎస్ఇ ఇచ్చిన సూచనల్ని ఆయా మంత్రిత్వ శాఖలు ఆమోదించాయి. 5 ప్రభుత్వరంగ సంస్థలను ఇతర పిఎస్‌యులలో విలీనం చేయమనిగానీ లేదా మూసివేయమనీ బిఆర్‌పిఎస్ఇ సూచించింది. ఇందులో ఐటిఐ సంస్థ కూడా ఒకటి.. ఐటిఐని బిఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయాలని బిఆర్‌పిఎస్ఇ సూచించింది.

2009-10 ఆర్థిక సంవత్సరంలో బిఎస్ఎన్ఎల్‌కు 1822 కోట్లు నష్టం వచ్చింది. దీంతో బిఆర్‌పిఎస్‌ఇకి పైన పేర్కొన్న వివరాల నన్నింటినీ బిఎస్ఎన్ఎల్ సమర్పించింది. 21.12.2010న జరిగిన బోర్డ్ ఆఫ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ రెవ్యూ మీటింగ్ జరిగింది.

ఈ రెవ్యూ మీటింగ్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం నుండి మెంబరు (ఫైనాన్స్) జాయింట్ సెక్రటరీ టెలికం పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ నుండి ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ (కన్స్యూమర్ మొబిలిటి), డైరెక్టర్ (కన్స్యూమర్ ఫిక్స్‌డ్ యాక్సెస్), ఇ.డి. (ఫైనాన్స్), ఇ.డి. (కార్పొరేట్ అఫైర్స్) పాల్గొన్నారు.

ఈ రెవ్యూ మీటింగ్‌లో సంస్థ ఆర్థిక స్థితిగతులపై బిఎస్ఎన్ఎల్ ఛైర్మన్ శ్రీ గోపాల్‌దాస్ 49 పేజీల నివేదికను సమర్పించారు. అందులో సంస్థ నష్టాలలోనికి రావడానికి కారణాలను, అందుకు సంస్థ తీసుకుంటున్న చర్యల్ని కూడా వివరించారు.

## బిఎస్ఎన్ఎల్ సిఎండి నివేదికలోని ముఖ్యాంశాలు

1. 2009-10 సంవత్సరంలో స్థూల ఆదాయంలో ఎయిర్‌టెల్ (45246 కోట్లు) తర్వాత బిఎస్ఎన్ఎల్ (32045 కోట్లు) రెండవ స్థానంలో వుంది. ఇది మార్కెట్ షేరు పరంగా 20.06% వుంది.
2. 2010-11 సంవత్సరంలో కూడా 30.9.2010 నాటికి ఎయిర్‌టెల్‌కు 23,816 కోట్లు (28.31) రాగా, బిఎస్ఎన్ఎల్ రెండవ స్థానంలో 14,483 కోట్లతో 17.25% వుంది.
3. మార్కెట్ వాటాపరంగా బిఎస్ఎన్ఎల్ 14.39%తో నాల్గవ స్థానంలో వుంది.

## నష్టాలకు మేనేజ్‌మెంట్ చెబుతున్న కారణాలు

1. బిఎస్ఎన్ఎల్ సంస్థకు ఉన్న ఆస్తులన్నీ లాండ్‌లైన్లకు సంబంధించినవే. ఉద్యోగులందరూ లాండ్ లైన్ల కోసం నియమించబడిన వారే. ఈ ఆస్తులను మెయిన్‌టెయిన్ చేయడానికి విపరీతమైన ఖర్చు అవుతోంది. పైగా లాండ్ లైన్లపై ఆదాయం 2005-06లో 20421 కోట్లు వుండగా 2009-10 సంవత్సరానికి 8,268 కోట్లుకు పడిపోయింది.
2. ప్రైవేట్ రంగంలోని మొబైల్ కంపెనీలతో పోటీపడి బిఎస్ఎన్ఎల్ మార్కెట్ వాటాను నిలదొక్కుకోవాలని చూస్తున్నా పోటీ తీవ్రంగా వుంది. దీంతో టారిఫ్‌లు తగ్గటం వల్ల ఒక్కో మొబైల్ పై వచ్చే సరాసరి ఆదాయం ఎఆర్‌పియు (యావరేజ్ రెవెన్యూ పర్ యూనిట్) గణనీయంగా పడిపోయింది.
3. ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్‌లో 2.89 లక్షల మంది ఉద్యోగులకు 2009-10 సంవత్సరంలో జీతభత్యాల కోసం 13,455 కోట్లు ఖర్చుతో మొత్తం ఆదాయంలో 42%గా వుంది. ఇది ఇతర పిఎస్‌యులతో పోలిస్తే చాలా ఎక్కువ.
4. బిఎస్ఎన్ఎల్ పనిచేసే ఉద్యోగులలో

| **వయస్సు** | **ఉద్యోగుల శాతం** |
|---|---|
| 24 సం॥లు | 1% |
| 25-29 సం॥లు | 3% |
| 30-34 సం॥లు | 4% |
| 35-39 సం॥లు | 4% |
| 40-44 సం॥లు | 9% |

| | |
|---|---|
| 45-49 సం॥లు | 26% |
| 50-58 సం॥లు | 19% |
| 59-60 | 4% |

2005-06 నుండి 2009-10 సం॥లతో పోలిస్తే సంస్థ ఆదాయం 22.76% తగ్గగా, ఉద్యోగుల ఖర్చు 2009-10 సం॥ నాటికి 81.31% పెరిగింది. ప్రస్తుతం సంస్థ వినియోగిస్తున్న టెక్నాలజీకి ఉద్యోగుల పరిజ్ఞానం సరిపోవడం లేదు. ఒకవేళ ఉద్యోగులకు తగిన ట్రైనింగ్ ఇచ్చినా అది మార్కెట్‌లోని పోటీకి, కాలపరిమితి సరిపోదు.

5. రంగంలోని ప్రైవేటు టెలికం కంపెనీలు ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని వెంటనే సమకూర్చుకుంటుండగా బిఎస్ఎన్ఎల్ ప్రభుత్వ నిబంధనల వల్ల పరికరాలను వెంటనే సమకూర్చుకోలేకపోతోంది.
6. గ్రామీణ ప్రాంతంలోని లాండ్‌లైన్స్ ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు నష్టం వస్తోంది. దీనికి తగిన పరిహారాన్ని ప్రభుత్వం అందించడం లేదు.
7. బిఎస్ఎన్ఎల్ ఏర్పాటు సమయంలో హామీ ఇచ్చిన మేరకు లైసెన్సు ఫీజు చెల్లింపు రద్దు, స్పెక్ట్రమ్ ఛార్జీల చెల్లింపు, ఎడిసి ఛార్జీల రద్దు వీటివల్ల కూడా బిఎస్ఎన్ఎల్‌కు నష్టాలు వచ్చాయి.
8. 2005-06తో 2009-10 ఆర్థిక సంవత్సరంలోని ఆదాయాలను పోలిస్తే పిసిఓలలో 46%, డబ్ల్యుఎల్ఎల్‌లో 15%, ఆపరేషన్ ఆదాయంలో 19%, ఇతర అంశాలలో 9% ఆదాయాలు తగ్గాయి. ఇతర ఆపరేటర్ల నుండి వచ్చే ఆదాయం 27% తగ్గింది.
9. 2010-11 సంవత్సరంలో బిఎస్ఎన్ఎల్‌కు 2600 కోట్లు నష్టం, 2011-12 సంవత్సరానికి ఈ నష్టం 623 కోట్లు ఉంటుందని ఓ అంచనా.

నష్టాల నివారణకు ప్రాజెక్టు, విజయ్, శిఖర్, స్టైల్, లాంటి వాటి ద్వారా తీసుకుంటున్న చర్యల్ని బిఎస్ఎన్ఎల్ ఛైర్మన్ వివరించారు.

## బిఆర్‌పిఎస్ఇ రికమెండేషన్లు

బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంట్ ఇచ్చిన నివేదికను పరిశీలించిన బిఆర్‌పిఎస్ఇ బిఎస్ఎన్ఎల్‌ను తిరిగి లాభాలలోనికి తేవడానికి ఈ క్రింది రికమెండేషన్లు చేసింది.

అ) ఉద్యోగుల జీతభత్యాలపై అవుతున్న భారీ ఖర్చుని తగ్గించడానికిగానూ ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చే విషయాన్నీ, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 సం॥లకు తగ్గించే అంశాన్ని పరిశీలించాలి. అలాగే ఉద్యోగులకు చెల్లించే అలవెన్సులు తగ్గించే అంశాన్ని పరిశీలించాలి.

ఆ) బిఎస్ఎన్ఎల్ వద్ద వున్న బంగారంలాంటి లాండ్ లైన్ల నెట్‌వర్క్‌ను వివిధ మార్గాల ద్వారా వినియోగించుకుని, బ్రాడ్‌బాండ్ మరియు వాల్యూయాడెడ్ సర్వీసుల ద్వారా ఆదాయం పెంచుకోవాలి.

ఇ) ఇందుకోసం తన వద్ద వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంచుకొని నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లోకి మార్చి ఆదాయం పెంచుకోవాలి.

ఈ) సంస్థలోని ఉన్నతస్థాయి అధికారుల అసమర్థ/నిర్ణయాలు తీసుకోలేని వైఖరి వల్ల 1) సంస్థ పనితీరు మార్చలేకపోడం, 2) సంస్థ బలాబలాలను తెలుసుకోలేకపోవడం, 3) మార్కెట్‌లోని అవకాశాలను గుర్తించలేకపోవడం, 4) మార్కెట్‌లో జరిగే మార్పులకు అనుగుణంగా విధానాలను వెంటనే మార్చుకోకపోవడం జరుగుతోంది.

ఉ) సంస్థ అందిస్తున్న సర్వీసు క్వాలిటీ విషయంలో వినియోగదారుల్లో విపరీతమైన అసంతృప్తి వుంది. ఈ అంశంలో బిఎస్ఎన్ఎల్ తీసుకుంటున్న చర్యలు బాగానే ఉన్నా అవి వెంటనే అమలయ్యేలా చూడాలి.

ఊ) 3జి లైసెన్సు విషయంలో అఖిల భారత స్థాయిలో లైసెన్సు కలిగి వున్న కంపెనీ బిఎస్ఎన్ఎల్ ఒక్కటే కనుక 3జి సర్వీసుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే విషయాన్ని పరిశీలించాలి.

ఎ) సరిహద్దు ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాలకు కూడా నష్టాలను భరించి బిఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తున్న దృష్ట్యా ఈ నష్టాలకు తగిన పరిహారాన్ని ప్రభుత్వం అందించాలి.

ఏ) బిఎస్ఎన్ఎల్ పరిస్థితిని మెరుగుపర్చడం కోసం కాలపరిమితితో కూడిన ప్రణాళికను 4 నెలలలోపు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం బిఆర్‌పిఎస్ఇకి సమర్పించాలి.

ఐ) ఈ అంశంలో భాగంగా ఎంటిఎన్ఎల్-బిఎస్ఎన్ఎల్ విలీనం అంశాన్ని పరిశీలించాలి.

ఒ) వృధాగా పడి వున్న బిఎస్ఎన్ఎల్ ఆస్తుల్ని గుర్తించి, వాటిని ఆదాయ మార్గాలుగా మార్చుకోవాలి.

ఓ) సాంకేతిక పరికరాల, ఎక్స్ఛేంజీల మెయిన్‌టెనెన్స్ ఖర్చులను తగ్గించాలి.

ఔ) వ్యూహాత్మక విభాగాలలోని పనుల్ని, సామాజిక విభాగాలలోని పనుల్ని విభజించి, సామాజిక విభాగాలలోని పనులకు ప్రభుత్వం నుండి పరిహారం కోరాలి.

క) ఐటిఐని బిఎస్ఎన్ఎల్‌లో విలీనం చేయాలి.

## గమనించాల్సిన అంశాలు

బిఎస్ఎన్ఎల్‌కు నష్టాలు ఎందుకు వస్తున్నాయి? అన్న ప్రశ్న ఎవరిని అడిగినా ప్రభుత్వ విధానాల వల్లనే అని ఖచ్చితంగా చెబుతారు. కానీ నష్టాలను సాకుగా చూపించి అందుకు కారణంగా ఉద్యోగుల జీతభత్యాలను చూపించి ఉద్యోగుల పై వేటు వేయాలన్న కుట్రను సాగనివ్వకూడదు.

బిఆర్‌పిఎస్‌ఇకి బిఎస్ఎన్ఎల్ నష్టాలు రావడానికి అనేక కారణాలను నివేదించిన మేనేజ్‌మెంట్, అందులో ఐటిఎస్ అధికారులు విలీనం కాకపోవడం అని చెప్పలేదు. బిఎస్ఎన్ఎల్‌కు ప్రభుత్వం 1999 నాటి టెలికం పాలసీ ప్రకారం లైసెన్సు ఫీజు నుండి మినహాయించాల్సి వుంది. కానీ బిఆర్‌పిఎస్‌ఇ నివేదిక ప్రకారం 3జి/బిడబ్ల్యుఎ లైసెన్సుల కేటాయింపుల కోసం బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటే హైయస్ట్ బిడ్డింగ్ మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. దీనివల్ల బిఎస్ఎన్ఎల్ 18500 కోట్లు నష్టపోయింది.

శ్యాంపెట్రోడా నివేదిక అమలులో భాగంగా గానీ, బిఆర్‌పిఎస్‌ఇ నివేదికలోగానీ, ఉద్యోగుల వేతనాలే ఇందుకు కారణమని మేనేజ్‌మెంట్ పేర్కొనడం గర్హనీయం.

2006, 2007, 2008, 2009 సంవత్సరాలలో జరిగిన సమ్మెలలో భాగంగా ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ అనేకసార్లు, సంస్థలో విఆర్ఎస్ అమలైతే, సంస్థలో డిజిన్వెస్ట్‌మెంట్ జరిగితే ముందుగా ఉద్యోగ సంఘాలను సంప్రదిస్తామని హామీ ఇచ్చాయి. ఈ హామీలను తుంగలో తొక్కుతూ ఉద్యోగుల పై కుట్ర పన్నాలని చూసే ఈ వ్యూహాలను మనం సంఘటితంగా ఎదుర్కోవాల్సి వుంది.

అయితే బిఆర్‌పిఎస్‌ఇ రికమెండేషన్లు అమలు కావాలంటే డిఓటికి, డిపిఇకి, ఆపైన కేంద్ర మంత్రివర్గం, ఈ అంశాలను ఆమోదించాల్సి వుంది. సంస్థ లాభాలలో నడవటం, ఆదాయాన్ని పెంచుకోవడం మిగతా అందరికంటే ఉద్యోగ వర్గాలకే ఎక్కువ అవసరం. డిపిఇ ఉత్తర్వు నెం. 18(9)/2004-జిఎం-జి2-62, తేది 1.4.2005 ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు తగ్గించే అధికారం కేవలం కేంద్ర మంత్రివర్గానికి మాత్రమే వుంది.

కొన్ని యూనియన్లు, అసోసియేషన్లు అదేపనిగా పదవీ విరమణ వయస్సు 58 సం॥లకు తగ్గించారని దుష్ప్రచారం చేస్తున్నాయి. బిఆర్‌పిఎస్‌ఇ చేసిన సిఫార్సుగానీ, శ్యాంపెట్రోడా నివేదికగానీ కేవలం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మాత్రమే. నివేదికల పైన, సిఫార్సుల పైనగానీ తమతమ అభిప్రాయాలు చెప్పకుండా ఉద్యోగులలో భయాందోళనలు కలిగించి, తద్వారా గుర్తింపు యూనియన్ దీనికి బాధ్యత వహించాలని కోరుతూ సమస్యను ప్రక్కదారి పట్టించాలని చూస్తున్నాయి. ఈ అసోసియేషన్లు, యూనియన్లు మేనేజ్‌మెంట్ తొత్తులూ వ్యవహరిస్తున్నాయనడానికి ఇదో పెద్ద ఉదాహరణ.

సంస్థ ఆర్థిక పరిస్థితి పేరుతో నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు రావాల్సిన చిన్నచిన్న ప్రయోజనాలను రద్దుచేసే మేనేజ్‌మెంట్ సంస్థలో పెద్ద ఎత్తున ఉన్నతాధికారులు చేసే అవినీతిపై మాత్రం ఏమీ మాట్లాడటం లేదు.

సంస్థను కాపాడుకోవడం అందరికంటే బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకే ఎక్కువ అవసరం. ఈ సంస్థ ఆస్తులను ఎలాగైనా బడా పెట్టుబడిదారులకు అప్పనంగా, కారుచౌకగా అప్పగించాలని చూస్తున్న ప్రభుత్వ విధానాలను సంఘటితంగా, ఐక్యంగా ఎదుర్కోవడానికి ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం వుంది.

తేది 27.3.2011
నిజామాబాద్

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**
**ఆంధ్రప్రదేశ్ సర్కిల్**